E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD | సంపుటి :01 | సంచిక :195 | బుధవారం 24-06-2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-

## పేరు పెట్టండి.. రూ.లక్ష గెలవండి

## తెలంగాణ సర్కార్ బంపర్ ఆఫర్




**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా అల్పాదాయ వర్గాలకు క్యూర్ ఏరియాలో ప్రతిపాదించిన లక్ష ప్లాట్ల నిర్మాణ పథకానికి పేరు ఖరారునకు హౌసింగ్ బోర్డు వినూత్న ప్రయత్నం చేపట్టింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకానికి మంచి పేరును నేరుగా ప్రజల నుంచే స్వీకరించాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది.

## మెట్రో విస్తరణకు లైన్ క్లియర్

## త్వరలోనే నివేదిక




# పీఏసీఎస్ పదవుల పంచాయితీ

- ఎమ్మెల్యేల వద్ద ఆశావహుల క్యూ
- నామినేటెడ్ పోస్టులకు పెరిగిన డిమాండ్
- 908 సంఘాల్లో నియామకాల కసరత్తు
- చైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులు
- సభ్యత్వం ఉన్నవారికే అవకాశం
- పాతవారికే తొలి ప్రాధాన్యం
- ఆరు నెలల కమిటీల ఏర్పాటు
- 110 సంఘాల పేర్ల స్క్రూటినీ
- ఎంపికలో ఎమ్మెల్యేలకు తలనొప్పి
- కొత్త సభ్యత్వాలపై భారీ ఆసక్తి
- 11,778 మందికి రాజకీయ అవకాశం
- ఖరీఫ్‌కు ముందే కమిటీల ఏర్పాటు
- రైతు సేవలపై ప్రభుత్వం ఫోకస్
- త్వరలో చైర్మన్ల ప్రకటన




**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో పాలకమండళ్లు నియమిస్తుండటంతో అధికార కాంగ్రెస్ నుంచి తీవ్ర పోటీ ఏర్పడింది. తమకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేల చుట్టూ స్థానిక నేతలు చక్కర్లు కొడుతున్నారు. ఆ పదవి రావాలంటే ఖచ్చితంగా సహకార సంఘంలో సభ్యులై ఉండాలి. లేకుంటే వారికి ఈ పదవి వరించే ప్రాప్తి లేదు. ఈసారి నియమించే పదవులకు ఆరు నెలల గడువు ఉండటంతో చాలా వరకు పాత వారికే అవకాశం ఇస్తున్నారు. తరువాత చేపట్టే పదవులు 2 సంవత్సరాలకు ఉండటంతో కొందరు ఇప్పటి నుంచే భూములు పట్టాలు చేసుకుంటున్నారు. తరువాత ప్రభుత్వం సభ్యులుగా చేరేందుకు నోటిఫికేషన్ ఇస్తే సభ్యత్వం తీసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

**908 సహకార సంఘాలు**

రాష్ట్రంలో 908 ప్రాథమిక సహకార సంఘాల ఉండగా వాటిలో 34,86,422 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. గత ఐదారేళ్ల నుంచి ఈ సంఘాల్లో సభ్యత్వాల జాడ లేదు. రాజకీయ నాయకులు కూడా వాటిపై పెద్ద ఆసక్తి చూపలేదు. ప్రభుత్వం నామినేటెడ్ విధానం తీసుకురావడంతో పీఏసీఎస్‌లకు ఆదరణ పెరిగింది. ప్రత్యక్షంగా రాజకీయాల్లో పోటీ చేయని వారంతా సహకార సంఘాల్లో పదవులు దక్కించుకునేందుకు క్యూ కట్టారు. రాష్ట్రంలో ఇప్పటివరకు భూములు కలిగిన రైతులు 73 లక్షలు ఉంటే ప్రస్తుతం సహకార సంఘాల్లో సగం మంది ఉన్నారు. ఒక వేళ సభ్యులుగా చేరేందుకు నోటిఫికేషన్ వస్తే మరో 15 లక్షల మంది చేరవచ్చని సహకార శాఖ అంచనా వేస్తోంది. కొత్తగా చేరి వారికి రూ. 10 వేల సభ్యత్వం పెడితే ప్రభుత్వానికి మరింత ఆదాయం రావచ్చని అభిప్రాయపడుతుంది. ఆ శాఖ అధికారులు ఈ నెలాఖరులో కొన్ని సంఘాలకు కమిటీ నియమించాలని స్థానిక ఎమ్మెల్యేల నుంచి సిఫారుసు లేఖ తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు 110 సంఘాలకు అభ్యర్థుల పేర్లు రాగా వాటిని స్క్రూట్నీ చేస్తున్నారు. వీలైనంత త్వరగా చైర్మన్లను ప్రకటించాలని మంత్రి తుమ్మల ఆదేశించడంతో అధికారులు ఎంపిక ప్రక్రియలో మునిగిపోయారు.

## వాహనదారులకు అదిరిపోయే గుడ్ న్యూస్

## ఆ నిబంధనల్లో భారీ ఊరట!




## ముగిసిన ఏపీ కేబినెట్ భేటీ


### ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త




**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** సీఎం చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ భేటీలో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా పలు చారిత్రాత్మక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేబినెట్ భారీ ఊరటనిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. 2004 కంటే ముందు ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

# అయోధ్య రామాలయం

# విరాళాల గోల్‌మాల్




**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబడిన అయోధ్య రామలయం విరాళాల్లో గోల్ మాల్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు యూపీ ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణకు సిట్ ను ఏర్పాటు చేయగా.. అన్ని కోణాల్లో పూర్తిగా విచారించారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి ఆలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, నగదు, బంగారు, వెండి కానుకల మళ్లింపు (దుర్వినియోగం) ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మంగళవారం ఉదయం తన ప్రాథమిక నివేదికను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సమర్పించింది. లక్నో డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సిట్ బృందం, ఈ నివేదికను యూపీ హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సంజయ్ ప్రసాద్‌కు అందజేసింది.

## నేరస్థుల్ని తయారుచేసే ఫ్యాక్టరీ

## వైసీపీ : మంత్రి నిమ్మల




**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** నేరస్థులను తయారుచేసే ఫ్యాక్టరీ వైఎస్సార్సీపీ పార్టీ అని, బూతునేతలకు ఆ పార్టీపేరు కేరాఫ్ అడ్రస్ గా మారిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. కేబినెట్ సమావేశానికి ముందు సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ, జగన్ లపై విమర్శలు గుప్పించారు. కాపు నేతలను బూతునేతలుగా మార్చి.. జగన్ వారి జీవితాలను నాశనం చేస్తున్నారని దుయ్యబట్టారు.

# చేయూత పెన్షన్లలో భారీ ప్రక్షాళన

## అనర్హులపై పెరిగిన ఫోకస్!

**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** చేయూత పెన్షన్ పథకాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ ఫలితాలు ఇస్తోంది. బ్యాంకు ఖాతాల ద్వారా పెన్షన్లు పొందుతున్న 19.04 లక్షలకుపైగా లబ్ధిదారుల్లో ఇప్పటి వరకు దాదాపు 15.93 లక్షల మంది లైవ్ అథెంటికేషన్ పూర్తి చేసుకున్నారు. ఇప్పటివరకు మొత్తం లబ్ధిదారుల్లో 83.88 శాతం మంది లైవ్ అథెంటికేషన్ పూర్తి చేసుకున్నారు. ఇంకా మూడు లక్షలకుపైగా మంది ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ద్వారా వేలాది అనర్హులను గుర్తించారు. ప్రజాధనాన్ని కాపాడుతూ, నిజమైన అర్హులకు సంక్షేమ ఫలాలు చేరేలా ప్రత్యేక పరిశీలన కార్యక్రమాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోంది. అనర్హులు అనేక మంది చేయూత పింఛన్లు పొందుతున్నారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో లైవ్ అథెంటికేషన్ ప్రక్రియను చేపట్టారు. దీనికి ప్రత్యేక పరికరాలను కొనుగోలు చేసి ఇచ్చారు.

**ఇంటింటికీ వెళ్లి పరిశీలన**

లైవ్ అథెంటికేషన్ సందర్భంగా గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేపట్టారు. ఈ క్రమంలో ఇప్పటికే మరణించిన 41 వేల మందికి పైగా లబ్ధిదారుల పేర్లపై పెన్షన్లు కొనసాగుతున్న విషయం వెలుగులోకి వచ్చాయి.



# ముగిసిన ఏపీ కేబినెట్ భేటీ.. ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

మొదటి పేజీ తరువాయి



తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11 వేల ఉద్యోగులకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. రిటైర్మెంట్ కాలంలో భద్రత కల్పించే ఈ నిర్ణయం ద్వారా ప్రతి ఉద్యోగికి సగటున దాదాపు రూ.3 కోట్ల వరకు లబ్ధి చేకూరుతుందని అంచనా వేస్తున్నారు.

రూ.34 వేల కోట్ల పెట్టుబడులు.. 35 వేల కొత్త ఉద్యోగాలు

రాష్ట్రంలో పెట్టుబడుల స్థాపన, నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం కీలక ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం ముద్ర వేసింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ద్వారా ప్రతిపాదించిన దాదాపు రూ.34 వేల కోట్ల భారీ పెట్టుబడుల స్థాపనకు కేబినెట్ అనుమతులు మంజూరు చేసింది. ఈ పరిశ్రమలు, ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం ద్వారా రాష్ట్రంలో కొత్తగా 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

రాజధాని, మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు

రాజధాని ప్రాంతంతో పాటు న్యాయవ్యవస్థకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పనపై కేబినెట్ ప్రత్యేక దృష్టి సారించింది. ఉండవల్లి పరిసర ప్రాంతాలలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 426 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. ఇక రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ శాశ్వత భవన నిర్మాణ పనుల కోసం రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# పేరు పెట్టండి.. రూ.లక్ష గెలవండి తెలంగాణ సర్కార్ బంపర్ ఆఫర్

మొదటి పేజీ తరువాయి




ప్రజల నుంచి వచ్చిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన పేరును సూచించిన వారికి ఒక లక్ష రూపాయల బహుమతిని అందచేస్తామని, సోషల్ మీడియా వేదికగా ఈ అంశంలో బహిరంగ పోటీని నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపీ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూర్ పరిధిలో అల్పాదాయ వర్గాల ప్రజల కోసం ప్రత్యేకంగా లక్ష ఇండ్లను నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంతర్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

ఎటువంటి వివాదాలు లేకుండా, అందుబాటులోని ధరల్లో వివిధ వర్గాల ప్రజల సొంత ఇంటి కలలను నెరవేర్చడంలో హౌసింగ్ బోర్డుకు మంచి పేరు ఉంది. అంతే కాకుండా బోర్డు ఆధ్వర్యంలో చేపట్టి ప్రాజెక్టులకు ప్రజల నుంచి ఆదరణతో పాటు డిమాండ్ కూడా ఉన్నదని ఆయన గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో సుదీర్ఘం కాలం తరువాత చేపడుతున్న ప్రాజెక్టులో ప్రజలను కూడా భాగస్వామ్యులను చేయాలన్న ఆలోచనతో, ప్రజల నుంచి అందే సూచనలతోనే ఈ పథకానికి పేరును కూడా ఖరారు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 28 వరకు సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన పోటీని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సూచించిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన దానికి లక్ష రూపాయలను బహుమతిగా ఇస్తామన్నారు.

హౌసింగ్ డిపార్ట్ మెంట్‌కు చెందిన tghd.official పేరుతో ఉన్న ఇన్‌స్టాగ్రామ్ https://www.instagram.com/p/DZ6mCF_E1PY/ ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు. క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎల్ ఐజి ప్లాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని, ఇందుకు అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించామని వివరించారు. ఇందుకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, లాటరీ పద్ధతిలో ఇండ్లను కేటాయిస్తామని, పూర్తి విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

# వాహనదారులకు అదిరిపోయే గుడ్ న్యూస్ ఆ నిబంధనల్లో భారీ ఊరట!



**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** దేశంలో వాహనాల సంఖ్య రోజు రోజుకు గణనీయంగా పెరిగిపోతుంటే అంతే వేగంగా కాలుష్యం కోరలు చాస్తోంది. దీనికి గడువు తీరిన వాహనాలు ఒక కారణమైతే.. కాలుష్య ధ్రువీకరణ చేసుకోకుండా యథేచ్ఛగా తిరిగే వాహనాలు మరో ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో దేశంలో వాహనాల కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ల జారీ విధానంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకురావడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 'పీయూసీసీ 3.0' పేరుతో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టేందుకు రవాణా శాఖ కసరత్తు చేస్తోందని ఇందులో భాగంగా బీఎస్ 6 వాహనాదారులకు భారీ ఊరట కల్పిస్తూ బీఎస్ 4 వాహనదారులకు బిగ్ షాక్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పీయూసీసీ మార్పులపై తాజాగా జాతీయ మీడియాలో వస్తున్న కథనాలు చర్చగా మారాయి.

ఇకపై మూడేళ్లకోసారి రెన్యువల్:

ప్రస్తుతం ఏదైనా వాహనం రోడ్లపై ప్రయాణం చేయాలంటే పొల్యూషన్ అండర్ కంట్రోల్(పీయూసీ) సర్టిఫికెట్ తప్పనిసరి. అయితే ఇప్పటి వరకు పీయూసీ సర్టిఫికెట్ రెన్యువల్ ప్రతి యేడాది చేసుకోవాలనే నిబంధనలో కీలక మార్పులు చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మార్పుల్లో భాగంగా ఇకపై ఆరు సంవత్సరాల లోపు వయసు కలిగి ఉన్న బీఎస్ 6 ప్రైవేట్ వాహనాలకు పీయూసీసీ సర్టిఫికేట్ రెన్యువల్ ను 3 మూడేళ్లకు పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. బీఎస్-6 వాహనాలు పర్యావరణానికి తక్కువ హాని కలిగిస్తాయి. ఎస్-4 వాహనాలతో పోలిస్తే బీఎస్-6 వాహనాలు 82 శాతం తక్కువ పర్టిక్యులేట్ మ్యాటర్, 25 శాతం తక్కువ నైట్రోజన్ ఆక్సైడ్లను విడుదల చేస్తాయి. ఈ నేపథ్యంలో ఆరేళ్ల లోపు వయసున్న బీఎస్-6 ప్రైవేట్ వాహనాలకు పొల్యూషన్ సర్టిఫికెట్ చెల్లుబాటు కాలాన్ని 3 సంవత్సరాలకు పొడిగించాలని అదే సమయంలో ఆరేళ్ల కంటే పై వయసు ఉన్న వాహనాలకు ఏడాదికి ఒకసారి పీయూసీసీ రెన్యువల్ చేసుకునేలా మార్పులు తీసుకురాబోతున్నట్లు తెలుస్తోంది.

బీఎస్ 4 వాహనదారులకు షాక్:

ఇక మార్చి 2020 కంటే ముందు తయారైన పాత బీఎస్-4 ప్రైవేట్ వాహనాలకు ప్రస్తుతం ఏడాదికి ఒకసారి ఉన్న నిబంధనను మార్చివేసి ప్రతి 6 నెలలకు ఒకసారి రెన్యువల్ చేసుకునేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. చాలా పాతవైన 1 నుండి బీఎస్-3 వాహనాలకు ప్రస్తుతం ఉన్న ఆరు నెలల గడువును తగ్గించి ప్రతి 3 నెలలకు ఒకసారి పొల్యూషన్ సర్టిఫికెట్ తీసుకోవడాన్ని తప్పనిసరి చేయబోతున్నట్లు సమాచారం.

పాతవాహనలను నిరుత్సాహపరిచేందుకే:

వాయు కాలుష్యానికి వాహన ఉద్గారాల వాటాను దృష్టిలో ఉంచుకుని పాత వాహనాలను ఉంచుకోకుండా ప్రజలను నిరుత్సాహపరిచేందుకు ఈ మార్పులను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఈ మార్పుల నేపథ్యంలో రీడింగ్‌లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసేందుకు పీయూసీసీ ప్రక్రియను కూడా మెరుగుపరుస్తున్నట్లు సంబంధిత అధికారి ఒకరు చెప్పినట్లు నేషనల్ మీడియో పేర్కొంది.

# మెట్రో విస్తరణకు లైన్ క్లియర్.. త్వరలోనే నివేదిక



**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకై సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్రమంత్రులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. మెట్రో రైలు స్వాధీనం, సెకండ్ ఫేజ్ విస్తరణకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి.. నేడు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో భేటీ అయ్యారు. ఉదయం నుంచి ఆయన నివాసంలోనే హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్ విస్తరణ, ఐఆర్ఎఫ్సి రుణం, తెలంగాణలో పలు కీలక ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. మెట్రో ఫేజ్ -1 వాల్యుయేషన్, ఫేజ్ -2 విస్తరణకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎస్బిఐ క్యాప్స్ కన్సల్టెంట్ గా వ్యవహరిస్తుందని ఈ సమావేశంలో నిర్ణయించారు. కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని.. సీఎం, కేంద్రమంత్రులు నిర్ణయించారు. ఇందులో సమన్వయ సభ్యులుగా కేంద్ర అధికారి, రాష్ట్ర MAUD స్పెషల్ సెక్రటరీ ఉండనున్నారు.

మెట్రో ఫేజ్-1 ఆస్తుల విలువ ఎంత?, ప్రభుత్వం దానిని ఎలా టేకోవర్ చేసుకోవాలి? ఫేజ్-2 విస్తరణకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్సి) నుంచి తక్కువ వడ్డీకి రుణం ఎలా పొందాలి అనే విషయాలపై ఎస్బిఐ క్యాప్స్ సమగ్ర నివేదికను ఇవ్వనుంది. ఈ నివేదిక ఆధారంగానే కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ తదుపరి నిధుల విడుదలకు క్లియరెన్స్ ఇవ్వనుంది. ఈ చర్చల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి సమర్పించిన రెండో దశ మెట్రో విస్తరణ ప్లాన్‌లో దాదాపు 70 కిలోమీటర్ల పైగా కొత్త మార్గాలను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

# నేరస్థుల్ని తయారుచేసే ఫ్యాక్టరీ వైసీపీ : మంత్రి నిమ్మల

మొదటి పేజీ తరువాయి




కాపులకు చంద్రబాబు 5 శాతం రిజర్వేషన్ ఇస్తే.. 2019లో జగన్ ఆ రిజర్వేషన్లను ఏకపక్షంగా రద్దు చేశారన్నారు. కాపులకు కొత్త రిజర్వేషన్ల సంగతి పక్కనపెట్టి.. ఇచ్చిన రిజర్వేషన్లను ఆనాడు నేతలంతా ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. 40 సంవత్సరాలుగా రిజర్వేషన్లు కోరుతున్న కాపులంతా నాడు ఏమైపోయారని ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలో కాపులకు రిజర్వేషన్లు ఇచ్చింది ఇద్దరే ఇద్దరు నేతలన్న నిమ్మల.. వాటిని తొలగించిన ఘనత ముగ్గురు నేతలకు చెందుతుందన్నారు. దామోదరం సంజీవయ్య, చంద్రబాబు కాపులకు రిజర్వేషన్లిస్తే.. నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, జగన్ లు వాటిని రద్దుచేశారన్నారు.

# అయోధ్య రామాలయం విరాళాల గోల్‌మాల్.. ప్రభుత్వానికి 'సిట్' ప్రాథమిక నివేదిక సమర్పణ!

మొదటి పేజీ తరువాయి



పర్యవేక్షణ లోపం – నిర్లక్ష్యం: ఆలయ హుండీ కానుకల లెక్కింపు, భద్రత, సీసీటీవీ ఫుటేజ్ నిర్వహణ, బ్యాంకుల్లో డిపాజిట్ చేసే ప్రక్రియలో తీవ్రమైన లోపాలు, నిర్లక్ష్యం జరిగినట్లు సిట్ ప్రాథమికంగా గుర్తించింది.

ట్రస్టు సిబ్బంది పాత్ర: విరాళాల లెక్కింపు, నిర్వహణతో సంబంధం ఉన్న దాదాపు 150 మందిని (ట్రస్టు సిబ్బంది, బ్యాంకు అధికారులు, ప్రైవేట్ ఉద్యోగులు) సిట్ ప్రశ్నించింది. బంగారం, వెండి, వజ్రాల వంటి విలువైన కానుకల లెక్కలపై కొందరు ఆఫీస్ బేరర్లు ఇచ్చిన సమాధానాలు ఏమాత్రం సంతృప్తికరంగా లేవని తేలింది.

మహా కుంభమేళా సమయంలోనే అక్రమాలు: జనవరి–ఫిబ్రవరి 2025లో జరిగిన మహా కుంభమేళా సమయంలో రోజుకు దాదాపు 10 లక్షల మంది భక్తులు రావడంతో, భారీగా వచ్చిన నగదు విరాళాలను మళ్లించడంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కుంభకోణం విలువ రూ. 200 కోట్లకు పైనే ఉండవచ్చని అంచనా.

సిట్ సిఫార్సులు – తదుపరి చర్యలు

అక్రమాలకు బాధ్యులైన వారిపై తక్షణమే అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన విచారణ జరపాలని, దొంగిలించిన సొమ్మును రికవరీ చేయాలని సిట్ సిఫార్సు చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు అనుమానితుల నుంచి రూ. 2 కోట్ల నగదు, ఒక ఎస్‌యూవీ వాహనం, 3 ఐఫోన్లను రికవరీ చేశారు. అలాగే, గతంలో విరాళాల లెక్కింపులో ఉన్న పాత సిబ్బంది అందరినీ విధుల నుంచి తొలగించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు ఈ నివేదిక సమర్పించబడగా.. రాబోయే 10 నుంచి 15 రోజుల్లో పూర్తి స్థాయి తుది నివేదికను అందజేస్తామని సిట్ సభ్యుడు విజయ్ విశ్వాస్ పంత్ తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా దోషులపై సీఎం యోగి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉండటంతో దేశవ్యాప్తంగా ఈ వ్యవహారం సంచలనంగా మారింది.

# చేయూత పెన్షన్లలో భారీ ప్రక్షాళన అనర్హులపై పెరిగిన ఫోకస్!

మొదటి పేజీ తరువాయి

చేయూత పింఛన్ల లో చనిపోయిన వారు, గుర్తించని వారి వివరాలు

| జిల్లా | చనిపోయిన వారు | నాట్ ట్రేస్ | మొత్తం |
|---|---|---|---|
| జగిత్యాల | 5278 | 1890 | 11,047 |
| కరీంనగర్ | 3637 | 2660 | 8,460 |
| సిద్దిపేట | 5041 | 857 | 7,211 |
| సిరిసిల్ల | 2026 | 877 | 6,521 |
| కొత్తగూడెం | 3509 | 352 | 5,850 |
| హైదరాబాద్ | 1018 | 05 | 5,377 |
| పెద్దపల్లి | 3376 | 620 | 4,858 |
| నాగర్ కర్నూలు | 1431 | 711 | 4,673 |
| మంచిర్యాల | 1679 | 2377 | 4,445 |

సంబంధిత కుటుంబ సభ్యులు కూడా వారి మరణాన్ని ధృవీకరించారు. అదే విధంగా సుమారు 14 వేల మంది లబ్ధిదారులు ఎక్కడా గుర్తించలేని పరిస్థితి (నాట్ ట్రేసబుల్)లో ఉన్నట్టు తేలింది. మరో 3,475 మంది ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్నప్పటికీ తెలంగాణలో పెన్షన్లు పొందుతున్నట్టు గుర్తించారు. అలాగే వంద మందికి పైగా లబ్ధిదారులు స్వచ్ఛందంగా తమకు పెన్షన్ అవసరం లేదని చెప్పారు. ఉపాధి లేదా ఇతర ఆదాయ వనరులు లభించడం వల్ల వారు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇంకా సుమారు 10 వేల మంది లబ్ధిదారుల ఆధార్ కార్డులు రద్దు అయినట్టు వెలుగులోకి వచ్చింది. డూప్లికేట్ లేదా బహుళ ఆధార్ కార్డుల కారణంగా ఈ ఆధార్‌లు చెల్లుబాటు కాకపోవడం వల్ల వారి అర్హతలను కూడా ప్రభుత్వం సమీక్షిస్తోంది. ఇప్పటివరకు మొత్తం లబ్ధిదారుల్లో 83.88 శాతం మంది లైవ్ అథెంటికేషన్ పూర్తి చేసుకున్నారు. ఇంకా మూడు లక్షలకుపైగా మంది ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. లబ్ధిదారుల సౌకర్యార్థం ప్రభుత్వం ఇప్పటికే గడువును వారం రోజుల పాటు పొడిగించింది. మంచానికే పరిమితమైన వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్లకే అధికారులు వెళ్లి లైవ్ అథెంటికేషన్ నిర్వహిస్తున్నారు. గతంలోనూ చేయూత పింఛన్లలో ప్రభుత్వ రిటైర్డ్? ఉద్యోగులకు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారికి ఇస్తున్నట్టుగా గుర్తించారు. ప్రభుత్వం నేరుగా బ్యాంకుల అకౌంట్లో చేయూత డబ్బులు జమ చేస్తుంది. అయితే వారు చనిపోయినా, ఇతర రాష్ట్రాలకు వెళ్లినా కూడా వారి సమాచారం లేకపోవడంతో వారి అకౌంట్లో డబ్బులు జమ అవుతూనే ఉన్నాయి. దీనికి అడ్డుకట్ట వేయడానికి నగరాల్లో చేయూత లబ్ధిదారుల వివరాలపై సర్వే కొనసాగిస్తున్నారు. ఇలా వీరు కూడా వేల సంఖ్యలో ఉన్నారని, వీరికి అడ్డుకట్ట వేయడం ద్వారా అనర్హులైన వారిలో కొత్త వారికి పింఛన్లు ఇవ్వవచ్చని అంచనా వేస్తున్నారు. త్వరలోనే ఈ సర్వే పూర్తి కానుంది.

# మళ్ళీ ప్రారంభమైన టెలిగ్రామ్ సేవలు




**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** నీట్ పేపర్ లీకేజీ కేసు వివాదం నేపథ్యంలో దేశంలో వారం రోజుల పాటు నిలిచిపోయిన ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్' సేవలు మళ్లీ ప్రారంభమయ్యాయి. జూన్ 16వ తేదీ నుండి జూన్ 22వ తేదీ వరకు భారత్‌లో టెలిగ్రామ్‌పై విధించిన బ్యాన్ గడువు ముగియడంతో, యాప్ సేవలు తిరిగి యథాతథంగా పని చేస్తున్నాయి.

వారం తర్వాత పనిచేస్తున్న యాప్

నీట్ పరీక్ష పేపర్ల లీకేజీ దర్యాప్తులో భాగంగా కేంద్ర ప్రభుత్వం భారత్‌లో టెలిగ్రామ్ యాప్‌ను వారం రోజుల పాటు నిషేధించిన సంగతి తెలిసిందే. సోమవారం రాత్రితో ఈ నిషేధ గడువు ముగిసింది. దీంతో జూన్ 23 తెల్లవారుజాము నుంచి నుండి దేశవ్యాప్తంగా టెలిగ్రామ్ సేవలు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి. యాప్ ఇప్పుడు ఎలాంటి అంతరాయం లేకుండా సాధారణంగా పనిచేస్తోందని, మెసేజ్‌లు పంపడం, అందుకోవడం వీలవుతోందని పలువురు వినియోగదారులు సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తున్నారు.

ప్లే స్టోర్‌లో ఇంకా రాని అప్‌డేట్

టెలిగ్రామ్ సేవలు మళ్లీ రన్ అవుతున్నప్పటికీ, గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో మాత్రం ఈ యాప్‌కు సంబంధించిన కొత్త అప్‌డేట్‌లు గానీ, కొత్తగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం గానీ ఇంకా పూర్తిగా అందుబాటులోకి రాలేదు. ఈ సాంకేతిక ప్రక్రియ పూర్తి కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఫోన్లలో ముందే ఇన్‌స్టాల్ అయి ఉన్న యాప్‌లు మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేస్తున్నాయి.

# పీఏసీఎస్ పదవుల పంచాయితీ

మొదటి పేజీ తరువాయి



ఒక చైర్మన్..12 మంది సభ్యులు

రాష్ట్ర వ్యాప్తంగా 908 సంఘాలు ఉండగా ఒక సంఘానికి ఒక చైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులతో కొలువు దీరేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. నామినేటెడ్ ద్వారా 11,778 మంది అధికార పార్టీ నేతలకు రాజకీయ ఉపాధి లభించనుంది. పాలకవర్గంలో ఒక ఎస్సీ మహిళ, ఒక ఎస్టీ మహిళ, ఇద్దరు బీసీ జనరల్, ఒక ఓసీ మహిళ, మరో ఏడుగురు జనరల్ సభ్యులు ఉంటారు. పదవుల్లో నియమితులయ్యే వారు ఆయా సంఘాల్లో సభ్యులై ఉండాలి. గతంలో రుణాలు తీసుకుని చెల్లించకుంటే అర్హులు కాదు. ప్రభుత్వ ఉద్యోగులు, పంచాయతీ రాజ్ సంఘాల్లో, ఇప్పటికే ఎన్నికైన ప్రజాప్రతినిధులకు అవకాశం లేదు. రెండు నెలలకితం 131 కొత్త సంఘాలు ఏర్పాటుకు జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపగా, వీటికి ప్రభుత్వం ఆమోదముద్ర వేస్తే వారి దశల వారీగా ఏర్పాటు కానున్నాయి. ముందుగా పాత సంఘాలకు పాలకవర్గం ఏర్పాటు చేసి కొత్త వాటికి రెండో విడుత నియమించున్నారు.


అభ్యర్థుల ఎంపిక ఎమ్మెల్యేలకు సవాల్

పీఏసీఎస్ సంఘాలకు పాలకవర్గం అభ్యర్థుల ఎంపిక ఎమ్మెల్యేలకు సవాల్‌గా మారింది. నామినేటెడ్ విధానం కావడంతో ఆశావాహుల సంఖ్య పెరుగుతుంది. ఎన్నికల ప్రక్రియ ఉన్నప్పుడు పెద్దగా అటు వైపు ఎవరు మొగ్గు చూపేవారు కాదు. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని, ఆర్దికంగా వెనకబడిన వారంతా పీఏసీఎస్‌ల్లో పదవులు కోసం పోటీ పడుతున్నారు. ఇప్పటివరకు పార్టీ కోసం వారు చేసిన సేవలు, ఆర్థికంగా నష్టపోయి పరిస్థితులను వివరిస్తూ ఈసారి ఎలాగైనా కట్టబెట్టాలని కోరతున్నారు. ప్రస్తుతం నియమించే కమిటీ పదవీకాలం ఆరు నెలలే ఉండటంతో మొన్నటివరకు పాలకవర్గంలో ఉన్న వారినే కొనసాగించేందుకు ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. కొత్తవారికి ఆరు నెలల తరువాత నియమించే కమిటీలో స్థానం కల్పిస్తామని హామీ ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

కొత్త కమిటీలతో మరిన్ని సేవలు

రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు కొత్త పాలకవర్గం కొలువు దీరితే రైతులకు మెరుగైన సేవలందుతాయి. సమయానికి వ్యవసాయ రుణాలు ఇవ్వటంతోపాటు ఎరువుల విక్రయాలు, ధాన్యం కొనుగోళ్ల వేగవంతం అవుతుంది. డీసీసీబీ నుంచి వ్యవసాయ భూములపై మార్ట్‌గేజ్ రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణకు రుణాలు, పశుపోషణకు రుణాలు, బంగారంపై రుణాలు అందుతాయి. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఎరువుల విక్రయాలు సాగుతున్నాయి. ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా, కాంప్లెక్స్ ఎరువుల ధరలు అధికంగా ఉండటంతో రైతులు ప్రాథమిక సహకారం సంఘాల్లో కొనుగోలు పెరుగుతుంది. యూరియా 80శాతం మేర సొసైటీల నుంచే రైతులకు అందుతోంది. పీఏసీఎస్ కేంద్రాలు ఏటా 5వేల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా నిర్వహిస్తున్నాయి. రాయితీపై వరి, కంది, పెసర, మినుము, జనుము, జీలుగ విత్తనాలను కూడా విక్రయిస్తున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఇబ్బందులు రాకుండా త్వరగా పాలకవర్గం నియమించేందుకు సహకార శాఖ కసరత్తు చేస్తోంది. ఎమ్మెల్యేలు పంపిన పేర్లు నిబంధనలు ప్రకారం ఉన్నాయో లేదో పరిశీలన చేస్తున్నారు.

# పవన్‌ను అంటే ఊరుకోవద్దు.. మంత్రులకు చంద్రబాబు కీలక సూచనలు



**న్యూస్ డెస్క్, 23 జూన్ (తెలుగు గళం):** కేబినెట్ భేటీ తరవాత సీఎం చంద్రబాబు మంత్రులకు పలు సూచనలు చేశారు. వైసీపీ క్రిమినల్స్ ను వెనకేసుకుని వస్తోందని అన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పవన్ కల్యాణ్ ను అనవసరమైన విషయాల్లోకి లాగితే కూటమి ఐక్యత చాటేలా మంత్రులంతా స్పందించాలని అన్నారు. ప్రతి మంత్రి అన్ని శాఖలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. డీఎస్సీ పరీక్షపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. జొన్నగిరి గ్రామాన్ని స్వర్ణగిరిగా నామకరణం చేద్దామని అన్నారు. అంతే కాకుండా జూలై 3న కడక స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేద్దామని అన్నారు.

విజయవాడ సాయికృష్ణ ఘటనలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. బాధిత తల్లిదండ్రులకు ప్రభుత్వంపై నమ్మకం ఉందని వ్యాఖ్యానించారు. సాయికృష్ణ ఘటనను వైసీపీ రాజకీయం చేస్తుందని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే ఇటీవల పవన్ కల్యాణ్ సైతం తనపై వస్తున్న విమర్శలపై జనసేన మంత్రులు స్పందించాలని ఆదేశించారు. ప్రతిసారి తానే మాట్లాడటం కుదరని మంత్రులు, ఎమ్మెల్యేలు బయటకు వచ్చి కౌంటర్లు ఇవ్వాలని అన్నారు. ఇప్పుడు చంద్రబాబు సైతం తమ పార్టీ నేతలకు పవన్ కల్యాణ్ ను విమర్శించినప్పటికీ కౌంటర్లు ఇవ్వాలని ఆదేశించడం ఆసక్తికరంగా మారింది.

# డ్రగ్స్, గుట్కా, గంజాయికి నో చెప్పండి

## -డిసిపి రాజమహేంద్ర నాయక్

### స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ పాఠశాలలో డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, జూన్ 23

స్టేషన్ ఘనపూర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్)లో మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో డ్రగ్స్, గంజాయి, గుట్కా, ఖైనీ వంటి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల బారిన పడకుండా సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే లింకులు, సందేశాలను నమ్మవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అదేవిధంగా విద్యార్థుల క్రీడా ప్రోత్సాహం కోసం వాలీబాల్‌లు, షటిల్ బ్యాట్‌లు, చెస్ బోర్డులు, క్యారం బోర్డులు పంపిణీ చేశారు. ఈ బహుమతులు మరియు క్రీడా కిట్లను డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ భీం శర్మ అందజేశారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని డీసీపీ సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలనలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ భీం శర్మ, సీఐ జి. వేణు, ఎస్సై పిట్ట రాజేష్, డబ్ల్యూఎస్ఐ మనీషా, పోలీసు సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు



# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది- రాపర్తి సోమయ్య

తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్, జూన్ 23



పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలంటే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండల కమిటీ ఆధ్వర్యంలో తిమ్మాపురం ప్రాథమిక పాఠశాల, హిమ్మత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించిన నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ, తిమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది 65 నుంచి 70 మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది వారి సంఖ్య 35 నుంచి 40 మందికి తగ్గిందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కొరతతో మూతపడగా, అక్కడి విద్యార్థులు ప్రస్తుతం తిమ్మాపురం పాఠశాలకు వస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే హిమ్మత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో కూడా విద్యార్థుల సంఖ్య తగ్గిందని, అక్కడ అటెండర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులకు ఇప్పటివరకు యూనిఫాంలు అందలేదని, వాటిని తక్షణమే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం పాఠశాలల కుదింపు ఆలోచనను విరమించుకుని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, సిబ్బంది, నాణ్యమైన విద్యా ప్రమాణాలను పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రజలకు అందుబాటులో ఉండి, నాణ్యమైన సేవలు అందించినప్పుడే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నక్క యాకయ్య, యాతం సమ్మయ్య, నేరటి కొమురయ్య, ఎర్ర రవి, జిల్లెల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఘన్పూర్ స్టేషన్ రైతు వేదికలో విత్తన మేళా

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘన్పూర్, జూన్ 23




జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్ మండల రైతు వేదికలో మంగళవారం విత్తన మేళా ఘనంగా నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరి సన్న రకాలైన బీపీటీ--5204, వరంగల్--44, ఆర్ఎన్ఆర్--15048, జై శ్రీరామ్, హెచ్ఎంటీ సోనా, కేఎన్ఎం--7715, కేఎన్ఎం--16038 తదితర విత్తనాలను ప్రదర్శించారు. అలాగే కంది, పెసర, నువ్వులు వంటి పంటల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను కూడా రైతులకు అందుబాటులో ఉంచి వాటి ఉపయోగాలను వివరించారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఏ పంటలు సాగు చేయాలి, ఏ రకాల విత్తనాలను ఎంపిక చేసుకోవాలి, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి అనే అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ, రైతులు ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని శాస్త్రవేత్తలు సూచించిన సాగు పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు ఖర్చులను కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని వివిధ రకాల విత్తనాలు, ఎరువుల విశేషాలను తెలుసుకొని వ్యవసాయ నిపుణుల సూచనలు స్వీకరించారు. ఈ విత్తన మేళా రైతులకు ఉపయోగకరంగా నిలిచిందని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు.

# మేజర్ స్టాం వాటర్ డ్రైన్ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్



తెలుగు గళం న్యూస్ జనగామ, జూన్ 23

జనగామ పట్టణంలో వరద ముంపు సమస్యల నివారణ కోసం రూ. 9.10 కోట్ల వ్యయంతో చేపడుతున్న మేజర్ స్టాం వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. బాణాపురం, రంగప్ప చెరువు, ప్రభుత్వ ఆసుపత్రి, కురుమవాడ, రైల్వే స్టేషన్ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీటితో బాలాజీనగర్, జ్యోతినగర్ ప్రాంతాలు ముంపునకు గురవుతున్న నేపథ్యంలో ఈ డ్రైన్ నిర్మాణం చేపడుతున్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడిన అధికారులు వారి సమస్యలను తెలుసుకున్నారు. సెంట్ మేరీస్, సాన్ మేరియా పాఠశాలల పరిసర ప్రాంతాల్లో రోడ్లు, సైడ్ డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానికులు వినతిపత్రం అందజేశారు. నెల రోజుల్లో డ్రైన్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బూడిది జ్యోతి, మంత్రి సుమలత, పానుగంటి సువార్త, మున్సిపల్ ఏఈ అనిల్, కాంట్రాక్టర్ దోర్నాల శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలి- పల్లె రాజిరెడ్డి



తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్, జూన్ 23

తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని స్వచ్ఛంద సంస్థల జిల్లా అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త, రక్తదాత పల్లె రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసి విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారని, అయితే తెలంగాణలో ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల విషయంలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ఫీజు రెగ్యులేటరీ కమిటీలు సమర్థవంతంగా పనిచేయకపోవడం వల్ల తెలంగాణలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులు దేశంలోనే అత్యధిక స్థాయికి చేరాయని అభిప్రాయపడ్డారు. అలాగే, ఈ విద్యా సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం నియమించిన తిరుపతిరావు కమిటీ సిఫార్సులను కూడా అమలు చేయకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఫీజు రెగ్యులేటరీ వ్యవస్థను బలోపేతం చేయాలని పల్లె రాజిరెడ్డి కోరారు

# ఎంజేపీ జయగిరి పాఠశాలలో యాంటీ-డ్రగ్స్ అవగాహన సదస్సు






తెలుగు గళం న్యూస్ హన్మకొండ/హసన్‌పర్తి, జూన్ 23

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం (జూన్ 26) సందర్భంగా హసన్‌పర్తి మండల పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) జయగిరి గురుకుల పాఠశాలలో మంగళవారం యాంటీ-డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి సీఐ ఎ. మహేందర్, ఎస్సై దేవేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాల గురించి వివరించారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి--జీవితానికి యెస్ చెప్పండి" అనే నినాదాన్ని ప్రతి విద్యార్థి ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల సరఫరా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచిస్తూ, ఈగల్ ఫోర్స్ తెలంగాణ టోల్ ఫ్రీ నంబర్ 1908 గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులందరితో డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు "యాంటీ డ్రగ్ సోల్జర్స్"గా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పోలీసు సిబ్బంది ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# గోపాల్‌పూర్ ఊరచెరువు అభివృద్ధి పనులు

## వేగవంతంగా పూర్తి చేయాలి- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



తెలుగు గళం న్యూస్ హనుమకొండ, జూన్ 23

గోపాల్‌పూర్ ఊరచెరువులో కొనసాగుతున్న పూడిక తొలగింపు, రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం గోపాల్‌పూర్ ఊర చెరువును సందర్శించిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూడిక తొలగింపు, రీటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, జీడబ్ల్యూఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో చెరువు అభివృద్ధి పనులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా అదనపు యంత్రాలు, సిబ్బందిని వినియోగించి డీసిల్టేషన్, రీటైనింగ్ వాల్ పనులను ఈ వారంలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. చెరువుల పునరుద్ధరణ వల్ల వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం మెరుగుపడటంతో పాటు ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని కలెక్టర్ తెలిపారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిరంతర పర్యవేక్షణతో పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్‌డీఎఫ్ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూన్ 23



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని కల్లెడలోని ఆర్‌డీఎఫ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్వతగిరి ఎస్ఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్రీడలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. విద్యార్థులంతా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

# ధర్మసాగర్‌లో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత సదస్సు



ధర్మసాగర్, జూన్ 23 (తెలుగు గళం):

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ (డీసీసీబీ) ధర్మసాగర్ శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత సదస్సును ధర్మసాగర్ రైతు వేదికలో నిర్వహించారు. నాబార్డ్ ఆదేశాల మేరకు రైతులు, ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ బ్యాంక్ ధర్మసాగర్ శాఖ మేనేజర్ ఆర్. వెంకటేష్ మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. నూతన డిపాజిట్ పథకం "రాణి రుద్రమదేవి డిపాజిట్ స్కీమ్" కింద ఖాతాదారులకు అత్యధికంగా 8.10 శాతం వడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే రైతుల అభివృద్ధి కోసం దీర్ఘకాలిక రుణాలు, బర్రెలు, గొర్రెలు, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు కొనుగోలు చేసేందుకు రుణ సదుపాయాలు, హౌసింగ్ లోన్లు, ఎడ్యుకేషన్ లోన్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో బ్యాంకింగ్ సేవలను సులభతరం చేసేందుకు ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, లాకర్ సదుపాయాలు కూడా అందిస్తున్నట్లు వివరించారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ రెడ్డి, ధర్మసాగర్ మండల వ్యవసాయ అధికారి రాజేష్, ఏఈఓ దివ్య, ధర్మసాగర్ పీఏసీఎస్ కార్యదర్శి పింగిలి రాజిరెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది ఆవుల కుమారస్వామి, బొడ్డు ప్రభుదేవ్, కలకోటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనం -- అధిక దిగుబడికి పునాది- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

తెలుగు గళం న్యూస్ జనగామ, జూన్ 23






రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. మంగళవారం నర్మెట్ట మండల రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను ప్రారంభించిన కలెక్టర్, వివిధ విత్తనాలు మరియు వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విత్తన మేళాల్లో సన్న వడ్లు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు అనధికార విక్రయ కేంద్రాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయకుండా, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలు మరియు ధ్రువీకరించిన డీలర్ల నుంచే కొనుగోలు చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో యూరియాను అధికంగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందని, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో యూరియా నిల్వలు తగినంతగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో సుమారు 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు, గత ఏడాదితో పోలిస్తే ఇది 1.5 లక్షల మెట్రిక్ టన్నులు అధికమని కలెక్టర్ తెలిపారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ, ఉద్యానవన పంటల సాగు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతల వినియోగం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందగలరని పేర్కొన్నారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, మహిళా రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, సర్పంచ్ శ్రీధర్ గౌడ్, ఎంపీడీవో, ఏడీఏ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మా ఎమ్మెల్యే గారు... మా బాధలు జర దేకో!



సత్తుపల్లి, జూన్ 23 (తెలుగుగళం న్యూస్)

- సత్తుపల్లి సర్కారోళ్ల హాస్టల్ గోస పట్టదా..?
- 24 మంది ఉండాల్సిన గదుల్లో 60 మంది విద్యార్థినులు
- రోజూ 3 కిలోమీటర్ల పాదయాత్ర... స్లాబ్ పెచ్చులు ఊడిపడతాయేమోనన్న భయం

సత్తుపల్లి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహ విద్యార్థినుల పరిస్థితి దయనీయంగా మారింది. చదువుకోవాలనే ఆశతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఎస్సీ బాలికలు సరైన వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం పాత హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుని కూలిపోవడంతో అప్పటి నుంచి విద్యార్థినులు తాత్కాలిక వసతుల్లోనే కాలం గడుపుతున్నారు. ప్రస్తుతం స్థానిక సాంఘిక సంక్షేమ పాఠశాల బాలికల వసతి గృహంలో కేవలం 24 మంది ఉండే సామర్థ్యం ఉన్న రెండు గదులను తాత్కాలికంగా కేటాయించగా, అందులో ఏకంగా 60 మంది విద్యార్థినులు నివాసం ఉంటున్నారు. దీంతో నిద్రించడానికి కూడా స్థలం సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా హాస్టల్ నుంచి సత్తుపల్లి బస్టాండ్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉండటంతో ప్రైవేట్, ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు ప్రతిరోజూ నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వర్షాకాలంలో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. తాత్కాలికంగా కేటాయించిన గదుల పరిస్థితి కూడా ప్రమాదకరంగా ఉందని విద్యార్థినులు చెబుతున్నారు. వర్షం పడితే స్లాబ్ నుంచి నీరు కారుతుందని, ఎప్పుడు పెచ్చులు ఊడిపడి తమపై పడతాయోనన్న భయంతో చదువుకోలేకపోతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. సత్తుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జేవీఆర్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల కళాశాలలతో పాటు ఇతర ప్రైవేట్, ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుకునేందుకు ప్రతి ఏడాది వందలాది మంది ఎస్సీ విద్యార్థినులు ఇక్కడికి వస్తున్నప్పటికీ, వారికి సరిపడా వసతి గృహ సౌకర్యాలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. "ప్రభుత్వ భవనం నిర్మించే వరకు అయినా ప్రైవేట్ భవనంలో హాస్టల్ ఏర్పాటు చేయాలి. శాశ్వత వసతి గృహం నిర్మించి మరింత మంది బాలికలకు విద్యావకాశాలు కల్పించాలి" అని విద్యార్థినులు కోరుతున్నారు. స్థానిక ఎస్సీ నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, జిల్లా అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని విద్యార్థినులు మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు. "చదువుకోవడానికి వచ్చాం... కానీ భవనం కూలిపోతుందేమోనన్న భయంతో బతుకుతున్నాం. మా గోడు వినండి... మాకు శాశ్వత హాస్టల్ కల్పించండి" అంటూ విద్యార్థినులు వేడుకుంటున్నారు.



# ఎల్ హెచ్ పి ఎస్ పోరాటంతోనే ఇళ్ల సర్వే"

## సింగరేణి పేలుళ్లతో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన అధికారులు

## బాధిత కాలనీల్లో హర్షాతిరేకాలు



సత్తుపల్లి,ఆర్ సి,జూన్23(తెలుగుగళం) న్యూస్:

నంగార భేరి లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్హెచ్‌పీఎస్) సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే సింగరేణి గనుల పేలుళ్ల ధాటికి దెబ్బతిన్న ఇళ్ల సర్వే ప్రక్రియ ప్రారంభమైందని ఆ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా సింగరేణి ప్రభావిత ప్రాంతాల వర్కింగ్ ప్రెసిడెంట్ భానోత్ నందు నాయక్, జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్ తెలిపారు. సత్తుపల్లి మండల తహసీల్దార్ ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని కిష్టారం బీసీ కాలనీలో రెవెన్యూ అధికారులు పర్యటించారు. సింగరేణి మైనింగ్ పేలుళ్ల (బ్లాస్టింగ్) కారణంగా ఇళ్లకు పడిన పగుళ్లను, వాటి తీవ్రతను అధికారులు నిశితంగా పరిశీలించి సర్వే నమోదు చేశారు.

ఈ సందర్భంగా ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు రాజేష్ నాయక్, గుగులోతు కృష్ణా నాయక్ కాలనీని సందర్శించి సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు, గ్రామస్థులు నాయకులను కలిసి హర్షం వ్యక్తం చేశారు. గతంలో తాము పడుతున్న ఇబ్బందులపై ఎల్హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో అనేక ఆందోళన కార్యక్రమాలు, పోరాటాలు చేయడం వల్లే నేడు ప్రభుత్వ యంత్రాంగం కదలివచ్చిందని కాలనీవాసులు పేర్కొన్నారు. తమకు న్యాయం జరిగేలా చొరవ చూపిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో: సంఘం ప్రతినిధులు సుభాని, బాజీ, పండు నాయక్, కృష్ణా నాయక్‌తో పాటు కిష్టారం గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తపల్లి గోరి తహసీల్దార్ కారును ఢీకొట్టిన ట్రాక్టర్

- కారు డ్రైవర్ సమయస్ఫూర్తితో తప్పిన ఘోర ప్రమాదం
- తహసీల్దార్ హేమ, సిబ్బంది సురక్షితం;కారు ధ్వంసం





తెలుగు గళం న్యూస్ గణపురం భూపాలపల్లి జూన్ 23

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే అధికారిక సమీక్షా సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్తున్న కొత్తపల్లి గోరి తహసీల్దార్ కారుకు తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. నిన్న సాయంత్రం సుమారు 3:30 గంటల ప్రాంతంలో కర్కపల్లి గ్రామ శివారులోని సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీ (బ్రిక్స్ ఫ్యాక్టరీ) సమీపంలో ఈ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు,బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గోరి తహసీల్దార్ హేమ తన సిబ్బందితో కలిసి కలెక్టర్ కార్యాలయ మీటింగ్‌కు కారులో బయలుదేరారు. ఆ సమయంలో కారులో తహసీల్దార్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్ రాజయ్య, విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (వి ఆర్ ఏ) బింగి నర్సింహా స్వామి ప్రయాణిస్తున్నారు. కారును ప్రభుత్వ డ్రైవర్ గౌడుగు సతీష్ నడుపుతున్నారు. కారు కర్కపల్లి వద్ద గల మహేందర్ అనే వ్యక్తికి చెందిన సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీ ప్రాంతానికి చేరుకోగానే,ఒక్కసారిగా ఒక ట్రాక్టర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా దూసుకువచ్చి తహసీల్దార్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే క్షణాల వ్యవధిలో తహసీల్దార్ కారు డ్రైవర్ గౌడుగు సతీష్ అత్యంత సమయస్ఫూర్తితో, అప్రమత్తంగా వ్యవహరించి వాహనాన్ని పక్కకు నియంత్రించారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడం వల్ల కారు లోపల ఉన్న తహసీల్దార్ హేమ, జూనియర్ అసిస్టెంట్ రాజయ్య, వీఆర్ఏ నర్సింహా స్వామి ఎలాంటి గాయాలు కాకుండా ప్రాణాపాయం నుండి తృటిలో బయటపడ్డారు. అయితే, ట్రాక్టర్ బలంగా ఢీకొనడం వల్ల తహసీల్దార్ అధికారిక కారు ఒకవైపు ఉన్న డోర్లు (తలుపులు) పూర్తిగా నలిగిపోయి తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌ను జర్పుల శ్రీధర్‌గా గుర్తించారు. ఈ ఘటనపై తాసిల్దార్ హేమ పోలీసులకు సమాచారం అందించి గణపురం ఎస్సై కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తహసీల్దార్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ జర్పుల శ్రీధర్‌పై నిర్లక్ష్యంగా వాహనం నడిపినందుకు కేసు నమోదు చేసి,దర్యాప్తు జరుపుతున్నారు. తహసీల్దార్ కారుకు ప్రమాదం జరిగిందన్న విషయం తెలియడంతో తోటి రెవెన్యూ అధికారులు, సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు,అయితే అందరూ క్షేమంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

# సంతోష్ కుటుంబానికి అండగా ఉంటాం

## -ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట /జూన్ 23

వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన మైదం సంతోష్ పార్థివదేహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నివాళులర్పించారు. ఇల్లందలో సంతోష్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే,మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడు సంతోష్‌కు ముగ్గురు చిన్నారులు ఉన్నందున, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయిన సంతోష్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం,వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎద్దు రాజేంద్ర ప్రసాద్, టెంపుల్ డైరెక్టర్ గుంటి కుమారస్వామి,ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గడ్డం సమ్మయ్య,వార్డు మెంబర్ ఎలికట్టె చిన్నరాజు,పల్లె రాజు,మైదం బుచ్చిమల్లు, బాషబోయిన ప్రవీణ్,దుపెల్లి ఏలియా,జోగుల పార్శా తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

## - మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూన్ 23

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలంలో ఇటీవల వేర్వేరు ప్రమాదాల్లో మృతిచెందిన కుటుంబాలను వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి పరామర్శించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన కుటుంబాలు:తురుకల సోమారం: ఘోర రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతిచెందిన మాజీ ఎంపీటీసీ వడ్లకొండ ఎల్లగౌడ్, ఎండీ అహ్మద్ కుటుంబాలను పరామర్శించారు. చౌటపల్లి:ఇటీవల మృతిచెందిన తోట కొమురు మల్లు కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు తోట స్వామి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పర్వతగిరి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బుద్దె చరణ్, గుండెపోటుతో మృతిచెందిన అంకటి మల్లేష్ కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు.

దౌలత్‌నగర్ తాటిచెట్టుపై నుంచి పడి మృతిచెందిన దొనికేన శ్రీనివాస్ గౌడ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ పరామర్శలో కార్యక్రమంలో పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ ఎం.మనోజ్ గౌడ్, మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రంగు కుమార్ గౌడ్, స్థానిక నాయకులు మాడుగుల రాజు,ఏర్పుల శ్రీనివాస్,చీమల బిక్షపతి,మట్టపెల్లి చిన్నమాధవరావు,బూర శ్యామ్ గౌడ్,బొట్ల మధు,జూల్లపెల్లి దేవేందర్ రావు, బానోత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రేవూరిపై అనుచిత వ్యాఖ్యలు

## : ఎమ్మెల్సీ పోచంపల్లి దిష్టిబొమ్మ దగ్ధం



తెలుగు గళం ఆత్మకూరు, జూన్ 23:

పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డిపై ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆత్మకూరు మండల కేంద్రంలో తీవ్ర నిరసన వ్యక్తమైంది. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల గుండెల్లో నిలిచిన ప్రజా నాయకుడు, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిపై ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. పదవీ కాంక్షతో, రాజకీయ ఉనికి కోసమే ఇటువంటి చౌకబారు విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. తక్షణమే రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్సీ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో హన్మకొండ జిల్లా ప్రధానకార్యదర్శి కమలాపూర్ రమేష్, మండల యూత్ అధ్యక్షులు తనుగుల సందీప్, మాజీ పి ఎస్సిఎస్ చేర్మెన్ ఎరకొండ రవీందర్, జెపాల్ రెడ్డి, కక్కెర్ల రాజు, ఉడతా రాజేందర్, సర్పంచ్ లు మండల నాయకులు గ్రామా అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు

# బంజారాహిల్స్‌లో మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి హౌస్ అరెస్ట్



తెలుగు గళం న్యూస్

యూరియా యాప్ రద్దు చేయాలన్న డిమాండ్‌తో కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో భారత రాష్ట్ర సమితి.. రైతు ధర్నాకు పిలుపునిచ్చింది. ధర్నాకు హైదరాబాద్ నుంచి బయలుదేరే క్రమంలో మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని బంజారాహిల్స్‌లోని నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ప్రశాంత్‌రెడ్డిని గృహనిర్బంధం చేయడాన్ని కేటీఆర్, హరీశ్‌రావు ఖండించారు. ప్రశాంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సంఘీభావం తెలిపారు. రైతుల తరఫున ప్రశ్నించే నాయకులను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమని మండిపడ్డారు. యూరియా కొరతతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఇబ్బందిపడుతున్నారని, యూరియా పంపిణీలో అమలుచేస్తున్న యాప్ విధానం రైతులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. రైతుల సమస్యలను లేవనెత్తిన వారిపై పోలీసులను ప్రయోగించడం దారుణమని ఆక్షేపించారు.

# మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి' -సర్పంచ్ తౌటి శ్రీలత



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి /జూన్ 23

వరంగల్ జిల్లాఅనంతారం, మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని అనంతారం సర్పంచ్ తౌటి శ్రీలత, సెర్ప్ సీసీ గోలి కొమురయ్య పిలుపునిచ్చారు. అనంతారం గ్రామంలో సరస్వతీ గ్రామైక్య సంఘం నెలసరి సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గొర్రె సుకన్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మహిళా రక్షణ చట్టాలు, వ్యక్తిగత పరిశుభ్రత, ప్లాస్టిక్ నివారణ, గృహహింస, వన మహోత్సవం అంశాలపై చర్చించారు.

ప్రధానాంశాలు:

1.మహిళా రక్షణ: మహిళలు, బాలల సంరక్షణ కోసం టోల్ ఫ్రీ నంబర్లు 100, 1098, 181 వినియోగించుకోవాలని సూచించారు.

2.పరిశుభ్రత: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని, ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

3.పర్యావరణం:ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని, హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు.

4.మహిళా శక్తి:ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి పథకాన్ని మహిళలంతా సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సన్మానం:

మొదటిసారిగా సమావేశానికి హాజరైన సర్పంచ్ తౌటి శ్రీలత, ఇటీవల బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి అనిత, ఎంపీవో శేషాంజనేయులును గ్రామైక్య సంఘాల ప్రతినిధులు శాలువాలతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ నాగమణి,సీసీ కొమురయ్య, కార్యదర్శి అనిత, ఏఎన్ఎం రజిత, వివోఏ మేకిరి రాజేశ్వరి, ఆశా వర్కర్లు,మహిళా సంఘాల లీడర్లు సుకన్య,సరోజన,పద్మ,శిరీష, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# కోటి మంది ఆడపడుచులను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం'-సర్పంచ్ తొర్రి పద్మ



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూన్ 23

వరంగల్ జిల్లా:కోటి మంది ఆడపడుచులను కోటీశ్వరులను చేయాలన్న ప్రభుత్వ సంకల్పం గొప్పదని ఏనుగల్లు సర్పంచ్ తొర్రి పద్మ-కుమార్ అన్నారు. ఏనుగల్లు గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన మహిళా గ్రామసభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామస్థాయిలో మహిళలకు సాధికారత కల్పించాలని,ప్రతి రంగంలో మహిళలు ముందుండాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు:

వడ్డీ లేని రుణాలు,ఉచిత బస్సు ప్రయాణం,పెట్రోల్ బంకులు,సోలార్ ప్లాంట్ల నిర్వహణ,ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరు మీదే మంజూరు చేస్తూ మహిళలను కోటీశ్వరులు చేయాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు ప్రోత్సాహం:

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే కుటుంబాలకు నల్లా పన్ను, ఇంటి పన్ను రద్దు చేస్తామని సర్పంచ్ ప్రకటించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ రంగంలో,ఆర్థికంగా, సామాజికంగా ముందు వరుసలో నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ, వార్డు మెంబర్లు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.